17 వరకూ ఎస్‌సి కులగణన గడువు పొడిగింపు

భీమవరం : జిల్లాలో ఎస్‌సి కులగణనపై జాబితా ప్రకటనకు ఈనెల 17 వరకు పొడిగించడం జరిగిందని, 7 వరకు అభ్యంతరాలను స్వీకరించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. ఎస్‌సి జనాభా, వారి వివరాలు, పేరు, ఆధార్ నంబర్, పుట్టిన తేదీ, వయసు, ఉపకులం, మరుగుదొడ్డి సౌకర్యం, తాగునీటి సౌకర్యం, విద్యార్హత, వృత్తి, వ్యవసాయం, ఇతర వివరాలపై సోషల్ ఆడిట్ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలోని అన్ని మండలాలు, మున్సిపాలిటీలలోని గ్రామ, వార్డు సచివాలయాలలో నోటీసు బోర్డులో షెడ్యూల్ కులాల వారి జాబితాను డిసెంబర్ 26వ తేదీన ప్రకటించడం జరిగిందన్నారు. తదుపరి మార్పులు, చేర్పులకు అభ్యంతరాలను ఈనెల 7 వరకు దరఖాస్తులను స్వీకరించడం జరుగుతుందని తెలిపారు. షెడ్యూల్ కులంకు సంబంధించిన వారు వారి వివరాలను సచివాలయాలలో పబ్లిష్ చేయబడిన జాబితాను పరిశీలించుకోవాలని తెలిపారు. డేటాపై అభ్యంతరాలను విఆర్ఒ పరిశీలించి, పోర్టల్లో పొందుపరచడం జరుగుతుందని తెలిపారు.

ఉత్సాహంగా.. ఉత్తేజంగా..!

రెండో రోజు కొనసాగిన సిపిఎం
26వ జిల్లా మహాసభ
మూడేళ్ల పోరాటాలు, ఉద్యమ ప్రణాళికపై సమగ్ర చర్చ

సిపిఎం 26వ జిల్లా మహాసభలో భాగంగా రెండో రోజు శనివారం ప్రతినిధుల సభ అత్యంత ఉత్సాహపూరిత వాతావరణంలో ప్రారంభమైంది. పతాకావిష్కరణతో ప్రారంభమైన ప్రతినిధుల సభలో అమరవీరులకు నివాళులర్పించిన అనంతరం సిపిఎం రాష్ట్ర నేతలు ప్రారంభోపన్యాసం చేశారు. అనంతరం గత మూడేళ్లలో చేపట్టిన ఆందోళనలు, పోరాటాలతో కూడిన కార్యకలాపాల నివేదికను ప్రవేశ పెట్టారు. దీనిపై ప్రతినిధులు కూలంకుషంగా చర్చల్లో పాల్గొన్నారు.

ప్రజాశక్తి - భీమవరం

రుద్రరాజు సత్యనారాయణరాజు (ఆర్ఎస్) నగర్ (ఛాంబర్ ఆఫ్ కామర్స్ భవనం)లో వలవల శ్రీరామ్మూర్తి ప్రాంగణంలో సిపిఎం సీనియర్ నేత, చించినాడ పోరాట యోధుడు కేతా సూర్యారావు పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. అమరవీరుల స్తూపం వద్ద మహాసభ ప్రతినిధులు అమరులకు ఘనంగా నివాళు లర్పించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం మహాసభ కమిటీలను ప్రకటించి వేదికపైకి ఆహ్వానించారు. జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జెఎన్‌వి.గోపాలన్, చింతకాయల బాబూరావు, కేతా గోపాలన్, డి.కళ్యాణి, బి.వాసుదేవరావు అధ్యక్షవర్గంగా వ్యవహరించారు. అనంతరం సంతాప తీర్మానాన్ని కె.రాజా రామ్మోహన్‌రాయ్ ప్రవేశపెట్టారు. సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, మాజీ ఎంఎల్ఎ, జిల్లా ఉద్యమ నిర్మాత ఆర్.సత్యనారాయణరాజు (ఆర్ఎస్), సీనియర్ నేత వలవల శ్రీరామ్మూర్తి మృతికి ప్రతినిధుల సభ సంతాపం తెలిపి రెండు నిమిషాలు మౌనం పాటించింది. పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటానికి సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.ఉమామహేశ్వరరావు, సీతారాం ఏచూరి చిత్రపటానికి మరో రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం, ఆర్ఎస్ చిత్రపటానికి జిల్లా కార్యదర్శి బలరాం, శ్రీరామ్మూర్తి చిత్రపటానికి జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు చింతకాయల బాబూరావు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. జిల్లా కార్యదర్శి బలరాం కార్యదర్శి నివేదికను ప్రవేశపెట్టారు. అనంతరం మండలాలు, రంగాలవారీగా ప్రతినిధులు చర్చల్లో పాల్గొన్నారు. ప్రతినిధులు కార్యదర్శి నివేదికను ఏకగ్రీవంగా ఆమోదించారు.

సిపిఎం పతాకాన్ని ఆవిష్కరిస్తున్న సీనియర్ నేత కేతా సూర్యారావు

రాష్ట్ర నేతలు మంతెన సీతారాం, వి.ఉమామహేశ్వరరావు, జిల్లా నేతలు

గీతాలు ఆలపిస్తున్న కళాకారుల బృందం

జిల్లా సమగ్రాభివృద్ధికి ప్రణాళిక రూపొందించాలి

సిపిఎం 26వ జిల్లా మహాసభ తీర్మానం - ఆ పార్టీ జిల్లా కార్యదర్శి బి.బలరాం వెల్లడి

ప్రజాశక్తి - భీమవరం

పాలకుల నిర్లక్ష్యమే జిల్లా సమగ్రాభివృద్ధికి అడ్డంకిగా మారిందని, జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు సమగ్ర ప్రణాళిక రూపొందించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం డిమాండ్ చేశారు. సిపిఎం 26వ జిల్లా మహాసభలో ఈ మేరకు తీర్మానం చేసినట్లు చెప్పారు. స్థానిక రుద్రరాజు సత్యనారాయణరాజు (ఆర్ఎస్) నగర్‌లోని వలవల శ్రీరామ్మూర్తి ప్రాంగణంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బలరాం మాట్లాడారు. జిల్లాలో గోదావరి జలాలు, సహజ సిద్ధమైన నిక్షేపాలు, ప్రకృతి వనరులు పుష్కలంగా ఉన్నాయన్నారు. అన్ని పంటలూ పండడానికి అనువైన సమ శీతోష్ణస్థితి జిల్లాలో ఉండడం మరో ప్రత్యేకతన్నారు. సమృద్ధిగా ఉన్న మానవ వనరులను కూడా పూర్తిగా వినియోగించుకోలేకపోతున్నారన్నారు. పాలకులు చిత్తశుద్ధితో నిధులు కేటాయించి సక్రమంగా దృష్టి పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. గోదావరి నది, కాల్వల ద్వారా జిల్లాలోని సారవంతమైన భూముల్లో అధికోత్పత్తి చేయొచ్చన్నారు. జిల్లాలో పాలకుల అసమర్థత వల్ల వేలాది మందికి ఉపాధి కల్పించే ఫ్యాక్టరీలు మూతపడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ ఫ్యాక్టరీలను తెరిపించడానికి ఇప్పటివరకూ ఎలాంటి చర్యలూ తీసుకోలేదన్నారు. జిల్లాలో వ్యవసాయాధార పరిశ్రమలను నెలకొల్పితే వేలాది మందికి ఉపాధి కల్పించవచ్చన్నారు. జిల్లాలో గ్యాస్ వంటి సహజ నిక్షేపాలు సమృద్ధి ఉన్నప్పటికీ వాటిని ఈ ప్రాంత ప్రజలకు అందించకపోవడం బాధాకరమన్నారు. ఏ ప్రాంతంలో లభ్యమయ్యే సహజ వనరులను తొలుత ఆ ప్రాంతానికి అందించడం సహజ న్యాయ సూత్రమన్నారు. జిల్లాలో లభ్యమవుతున్న సహజ వాయువును ఇక్కడ వినియోగిస్తే గ్యాస్ సిలిండర్‌ను రూ.వందకే అందించవచ్చని తెలిపారు. జిల్లా ప్రజలను విపరీతమైన కాలుష్యం వేధిస్తోందని మహాసభ ఆందోళన వ్యక్తం చేసిందని బలరాం తెలిపారు. ప్రజలు ఎక్కువ సంఖ్యలో రోగాల బారిన పడడానికి ఈ కాలుష్యమే ప్రధాన కారణమన్నారు. రోగ పీడితులతో ఆసుపత్రులు నిండిపోతున్నాయన్నారు. కేన్సర్, గుండెజబ్బు, కాలేయ సంబంధిత, చర్మ వ్యాధులు విపరీతంగా పెరుగుతున్నాయన్నారు. జిల్లాలోని నీటిలో అత్యంత ప్రమాదకరమైన బ్యాక్టీరియా ఉన్నట్లు నిపుణులు గుర్తించి పలు సూచనలు చేసినా పాలకులు పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. దొంగరావిపాలెం తదితర ప్రాంతాల్లో ఎత్తిపోతల పథకాలను ఏర్పాటు చేసి నీటిని అందించాలన్నారు. ప్రభుత్వ రంగంలోనే విద్యాలయాలు, వైద్యకళాశాల ఏర్పాటు చేయాలని కోరారు. తీర ప్రాంతాల్లోని వనరుల ఆధారంగా పర్యాటక ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలన్నారు. జిల్లాలోని అన్ని రకాల పరిశ్రమల్లో స్థానికులకు 75 శాతం ఉద్యోగావకాశాలు కల్పించాలని బలరాం డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జెఎన్‌వి.గోపాలన్, చింతకాయల బాబూరావు, బురిడి వాసుదేవరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బలరాం

బిల్లులో 'ఎఫ్‌పిపిసిఎ' ఛార్జీల మోత..!

హడలెత్తిస్తున్న విద్యుత్ బిల్లులు
జనవరి నెల బిల్లులో మరో ఎఫ్‌పిపిసిఎ భారం
ఒకేసారి మూడు అదనపు భారాలతో జనం బెంబేలు
వినియోగించిన విద్యుత్‌కు.. బిల్లుకు మధ్య భారీ తేడా
దిక్కుతోచని స్థితిలో విద్యుత్ వినియోగదారులు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

విద్యుత్ ఛార్జీల భారం మోయలేక జనం అల్లాడిపోతున్నారు. గత ప్రభుత్వం తప్పిదమంటూ కూటమి సర్కార్ తప్పించుకునే పనిలో పడగా, ఈ భారమంతా కూటమి ప్రభుత్వానిదేనంటూ వైసిపి తీవ్ర విమర్శలు చేసుకుంటూ జనాల నెత్తిన భారాలు మోపి ఇరుపార్టీలు వికటాట్టహాసం చేస్తున్న పరిస్థితి నెలకొంది. వాడుకున్న విద్యుత్‌కు.. వస్తున్న కరెంటు బిల్లులకు ఏమాత్రమూ సంబంధం లేకుండా జనాలు లబోదిబోమంటున్న పరిస్థితి ఏర్పడింది. రూ.687 కరెంటు బిల్లులో అదనపు ఛార్జీల భారం రూ.313 ఉన్న పరిస్థితి నెలకొంది. బిల్లులో సగం వరకూ అదనపు ఛార్జీల భారాన్ని జనం నెత్తిన రుద్దిన దుస్థితి కొనసాగుతోంది. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాలో 12 లక్షలకుపైగా విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. వీటిలో మూడొంతుల విద్యుత్ కనెక్షన్లు సామాన్య ప్రజానీకానికి సంబంధించినవే. డిసెంబర్ కరెంటు బిల్లులతోనే జనం తీవ్ర ఆందోళన చెందగా జనవరి నెల బిల్లులు మరింత షాక్ కొడుతున్న పరిస్థితి నెలకొంది. డిసెంబర్ నెలలో ఎఫ్‌పిపిసిఎ (ఫ్యూయల్ అండ్ పవర్ పర్చస్ కాస్ట్ అడ్జస్టెట్‌మెంట్) ఛార్జీలు రెండు ఉండగా, జనవరిలో నెలలో ఎఫ్‌పిపిసిఎల భారాలు మూడుకు చేరాయి. దీంతో బిల్లులు మోతమోగుతున్న పరిస్థితి నెలకొంది. 2022-23,2023-24 సంవత్సరాలకు సంబంధించి విద్యుత్ పంపిణీలో అదనపు ఖర్చుల పేరుతో జనాలపై విద్యుత్ బిల్లుల బాదుడు తారాస్థాయికి చేరింది. విద్యుత్ బిల్లులో సగం అదనపు ఛార్జీల భారమే ఉంటుంది. గత వైసిపి పాలనలో ఏడుసార్లు అదనపు ఛార్జీల భారం వడ్డించగా, కూటమి ప్రభుత్వం వచ్చిన ఆరునెల్లోనూ రెండు అదనపు ఛార్జీల భారం మోపింది. తాము అధికారంలోకి వస్తే విద్యుత్ ఛార్జీలు పెంచబోమంటూ అధికారంలోకి వచ్చిన కూటమి సర్కార్ వరుస విద్యుత్ ఛార్జీల వడ్డన సాగిస్తోంది. ప్రస్తుతం శీతాకాలం కావడంతో విద్యుత్ వాడకం తక్కువగా ఉంటుంది. చలి విపరీతంగా ఉండడంతో ఫ్యాన్ కూడా వేసుకోలేని పరిస్థితి ఉంది. ఇక ఎసిల ఊసే లేకుండా పోయింది. కానీ కరెంటు బిల్లులు మాత్రం ఏమాత్రమూ తగ్గలేదు. ఎఫ్‌పిపిసిఎ భారాలే ఇందుకు ప్రధాన కారణం.



READING	MONTH	S/S
PRES KWH	22476 04-01-2025	1
PREV KWH	22361 02-12-2024	1
AVG UNITS		144
BILLED UNITS		115
RMD		1.0KVA
ENERGY CHRG		47[illegible].95
FIXED CHRG		20.00
CUST CHRG		45.00
ED		6.90
SURCHARGES		25.00
ED INT		0.07
TRUEUP CHRG		0.00
FPPCA CHRG		9[illegible].20
FPPCA2 CHRG		58.00
FPPCA3 CHRG		6[illegible].88
SHORTFALL		0.00
ACD SURCHRG		0.00
FAN INSTAL		0.00
ADJ AMOUNT		0.00
LOSS/GAIN		-0.00
BILL AMOUNT		78[illegible].0
GOVT SUBSIDY		10[illegible].0

జనవరి 3వతేదీన తీసిన బిల్లులో మూడు ఎఫ్‌పిపిసిఎ ఛార్జీలు



ENERGY CHRG	422.9
FIXED CHRG	20.0
CUST CHRG	45.0
ED	6.4
SURCHARGES	25.0
ED INT	0.0
TRUEUP CHRG	0.0
FPPCA CHRG	95.1
FPPCA2 CHRG	49.0
SHORTFALL	0.0
ACD SURCHRG	0.0
FAN INSTAL	0.0
ADJ AMOUNT	0.0
LOSS/GAIN	0.3
BILL AMOUNT	664.0
GOVT SUBSIDY	87.0
BILL AFT SUB	577.0

గడిచిన డిసెంబర్ 3వ తేదీన తీసిన బిల్లులో రెండు ఎఫ్‌పిపిసిఎ ఛార్జీలు

సంక్షేమం ముసుగు.. భారాల బాదుడు

ప్రజలకు పెద్దఎత్తున సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు గొప్పలు చెబుతున్న కూటమి ప్రభుత్వం మరోపక్క భారాలను మాత్రం విపరీతంగా మోపుతోంది. గడిచిన ఆరు నెలల్లోనే రెండు ఎఫ్‌పిపిసిఎ విద్యుత్ భారాలను జనాలపై మోపింది. వంట నూనె నుంచి పప్పుల నుంచి ఇతర నిత్యావస్తువుల ధరలన్నీ ఆకాశాన్నంటాయి. గతంలో నెలవారీ నిత్యావసర ఖర్చులకు రూ.రెండు వేలు అయితే ఇప్పుడు రూ.ఐదు వేలు అవుతోంది. అడ్డూ అదుపూలేని ధరలతో జనం ఇబ్బందులు పడుతుండగా కరెంటు ఛార్జీల పేరుతో కూటమి ప్రభుత్వం మరింత దారుణంగా హింసిస్తోంది. కరెంటు బిల్లులో ఫిక్స్‌డ్, కస్టమర్, ఈడి, సర్‌ఛార్జీలు, ఎఫ్‌పిపిసిఎ ఛార్జీల మోత మోగిపోతుంది. జనవరి మూడో తేదీ నుంచి కరెంటు బిల్లులు తీయడం ఆరంభమైంది. బిల్లులు చూసి జనం షాక్ తింటున్నారు. ఏలూరు టుటౌన్‌లో ఒక ఇంటికి వాడిన విద్యుత్‌కు రూ.473 బిల్లురాగా ఎఫ్‌పిపిసిఎల భారం రూ.214 ఉంది. డిసెంబర్ నెలలో ఎఫ్‌పిపిసిఎ, ఎఫ్‌పిపిసిఎ 2 భారాలు మాత్రమే ఉండగా జనవరిలో తీస్తున్న బిల్లులో ఎఫ్‌పిపిసిఎ3 భారం కలిసింది. దీంతో బిల్లుల మోతమోగిపోతున్నాయి. విద్యుత్ ఛార్జీల పేరుతో ప్రభుత్వం జనాలను పీల్చిపిప్పి చేస్తోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సంక్షేమ పథకాల పేరుతో ఇచ్చినట్లే ఇచ్చి.. ఇతర రూపాల్లో గుంజుకుంటుందున్న చర్చ ప్రజల్లో నెలకొంది. ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత రావడంతో ఇక నుంచి అదనపు ఛార్జీల భారాన్ని ఏ నెలకు ఆ నెలలో వసూలు చేయాలన్న ఆలోచన సైతం విద్యుత్‌శాఖ, ప్రభుత్వం చేస్తున్నట్లు తెలుస్తోంది.

నిర్వాసితులకు పరిహారం ఇచ్చిన ఘనత చంద్రబాబుదే

జల వనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

ఇచ్చిన హామీ ప్రకారం అధికారంలోకి వచ్చిన ఐదారు నెలల్లోనే ఒకే రోజు పోలవరం నిర్వాసితులకు రూ.832 కోట్ల పరిహారం చెల్లించిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుదేనని జల వనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. పాలకొల్లు మండలం తిల్లపూడి, శివదేవునిచిక్కాల, పాలమూరు, గవరపేట, బల్లిపాడు, దగ్గులూరు గ్రామాల్లో రూ.6.85 కోట్లతో వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు శనివారం భూమి పూజచేసి, శిలాఫలకాలను మంత్రి నిమ్మల రామానాయుడు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో పోలవరం నిర్వాసితులకు పరిహారంగా రూపాయి కూడా చెల్లించకుండా దగా చేసిందన్నారు. ప్రస్తుతం రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఇబ్బందిగా ఉన్నప్పటికీ ఇచ్చిన మాట ప్రకారం అధికారంలోకి వచ్చిన తరువాత రూ.832 కోట్లు చెల్లించిన ఘనత చంద్రబాబుది అన్నారు. ఒక్కొక్కరికీ రూ.10 లక్షల నుంచి రూ.40 లక్షల వరకూ బ్యాంకుల్లో జమయ్యాయని తెలిపారు. ఆనాడు 2017లో ఎనిమిది వందల కోట్ల రూపాయల పరిహారం గాను నేడు రూ.832 కోట్లు ఇచ్చింది చంద్రబాబేనని తెలిపారు. మధ్యలో వచ్చిన జగన్ ముంచేశాడని విమర్శించారు. 2019లో కుర్చీ కోసం, అధికారం కోసం జగన్ నిర్వాసితులకు ఒక్కొక్కరికీ రూ.10 లక్షల చొప్పున ఇస్తానని హామీ ఇచ్చారని, అధికారంలోకి వచ్చాక పట్టించుకోలేదని తెలిపారు. పోలవరం ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలను అటు ఉత్తరాంధ్ర ఇటు రాయలసీమకు మళ్లించడం ఎంత ముఖ్యమో నిర్వాసితులను ఆదుకొని సాయం చేయడం కూడా అంతే ముఖ్యమన్నారు. వచ్చే సంక్రాంతి నాటికి అభివృద్ధి కార్యక్రమాలు పూర్తిచేసి ప్రజలకు అంకితం చేస్తామని మంత్రి తెలిపారు. స్వయంగా మంత్రి మోటార్ సైకిల్ నడుపుతూ ప్రజలను పలకరించి, యోగ క్షేమాలు అడిగి తెలుసుకుంటూ అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. కార్యక్రమంలో మాజీ ఎంఎల్‌సి అంగర రామ్మోహన్, జిల్లా పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ అధికారి కెఎస్ఎస్ఎస్.శ్రీనివాసరావు, గృహ నిర్మాణ శాఖ ఇఇ ఎం.శ్రీనివాసరావు, తహశీల్దార్ వై.దుర్గాకిషోర్, ఎంపిడిఒ ఎన్.ఉమామహేశ్వరరావు, డిఇలు పాల్గొన్నారు.

శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి నిమ్మల రామానాయుడు

పేదలకు ఉపయోగకరంగా సైన్సు అభివృద్ధి చేయాలి

ఎంఎల్‌సి బి.గోపీమూర్తి

ప్రజాశక్తి - వీరవాసరం

పేదలకు ఉపయోగపడేలా సైన్సు అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని ఎంఎల్‌సి బి.గోపీమూర్తి అన్నారు. వీరవాసరం ఎంఆర్‌కె జిల్లా పరిషత్ హైస్కూల్ వద్ద జిల్లాస్థాయి సైన్సు ఫెయిర్‌ను ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ సైన్సు వల్ల విజ్ఞానం పెరుగుతుందన్నారు. విద్యార్థులు సైన్సు పట్ల ఆసక్తి కనబర్చాలన్నారు. ప్రభుత్వాలు విద్యాభివృద్ధికి పెద్దపీట వేస్తున్నాయని, దాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎంఎల్‌సి గోపీమూర్తి మాట్లాడుతూ నేటి సైన్సు కార్పొరేట్ సంస్థకు మాత్రమే ఉపయోగపడేదని, ఈ సైన్సు వల్ల సార్థకత లేదని అన్నారు. సమాజాన్ని ప్రశ్నించే సైన్సు నేటి కాలంలో నేర్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. నాడు ప్లేగు వ్యాధికి మందు కనుగొన్న ఎల్లాప్రగడ సుబ్బారావు సైన్సుకు ఆదర్శప్రాయుడన్నారు. జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ సైన్సు ఫెయిర్‌ను విద్యార్థులు ఒక ప్రదర్శనగా మాత్రమే చూడాలన్నారు. మెరిట్ ఉన్నవారే ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులుగా నియమించబడతారని, అటువంటి వారు చెప్పిన విద్యాబోధనే విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఉపాధ్యాయులు తమ ప్రతిభను మరింత మెరుగుపర్చుకుని విద్యార్థులకు అందించాలన్నారు. టెక్నాలజీ అభివృద్ధితోనే ఆధార్‌ను అభివృద్ధి చేసుకున్నామన్న విషయాన్ని విద్యార్థులు మరువకూడదన్నారు. టెక్స్ట్‌బుక్స్ బాగా అధ్యయనం చేయడం వల్ల మంచి ఫలితాలు వస్తాయన్నారు. యుట్యూబ్‌లో సైన్స్ వీడియోలు వీక్షించి మరింత విజ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చన్నారు. జిల్లా సైన్సు అధికారి విఎంజెడ్. శ్యామ్‌ప్రసాద్ మాట్లాడుతూ ఈ సైన్సు ఫెయిర్‌లో అరవై ప్రదర్శనలు ఉన్నాయన్నారు. మూడు విభాగాలుగా నిర్వహించే ఈ ఫెయిర్ నుంచి ఒక్కో విభాగం నుంచి రెండు ఉత్తమ ప్రదర్శనలు ఎంపిక చేసి రాష్ట్రస్థాయికి పంపుతామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఒ కె.ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, డిఇఒ నారాయణ, ఎంపిపి వీరవల్లి దుర్గాభవాని, జెడ్‌పిటిసి గుండా జయప్రకాష్‌నాయుడు, ఎంఇఒలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వీరవాసరం ఎంఆర్‌కె జిల్లా పరిషత్ హైస్కూల్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్ విజేతలను శనివారం సాయంత్రం ప్రకటించారు. వ్యక్తిగత విభాగంలో కె.మణికంఠ, ఆకివీడు బాలుర ఉన్నత పాఠశాల, ఎన్.హనుమ మండల పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాల జల్లికొమ్మర, గ్రూప్ విభాగంలో కెలక్ష్మీనాగ, భవాని, కె.జాద్విక రెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జుత్తిగ, మహమ్మద్ ఫాజిల్ ఈ జహీరా, ఎస్ భార్గవి, తణుకు బాలుర ఉన్నత పాఠశాల, ఉపాధ్యాయ విభాగంలో ఎం.రామాంజనేయరావు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వైవి.లంక, కె.ఎన్ జోగిరెడ్డి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఆలమూరు ఉత్తమంగా ఎంపికయ్యారు. వారికి అసిస్టెంట్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ పి శ్యాంసుందర్ చేతుల మీదుగా అందజేశారు.

మాట్లాడుతున్న ఎంఎల్‌సి గోపీమూర్తి

డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని పాలకొల్లు కోకోనట్ మర్చంట్స్ ప్రభుత్వ జూనియర్(బాలికలు) కళాశాలలో మంత్రి నిమ్మల, జెసి టి.రాహుల్ కుమార్ రెడ్డి సంయుక్తంగా ప్రారంభించారు. అలాగే జిల్లాలోని పలు కళాశాలల్లో ఎంఎల్ఎలు కార్యక్రమాన్ని ప్రారంభించారు. వార్త 6లో..

లూయిస్ బ్రెయిలీ జీవితం ఆదర్శనీయం : మంత్రి

పాలకొల్లు : డాక్టర్ లూయిస్ బ్రెయిలీ జీవితం ప్రపంచానికే ఆదర్శనీయమని మంత్రి, డాక్టర్ నిమ్మల రామానాయుడు అన్నారు. పాలకొల్లు లయన్స్ క్లబ్‌లో జరిగిన లూయిస్ బ్రెయిలీ 216వ జయంతి వేడుకల్లో మంత్రి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. లూయిస్ బ్రెయిలీ చిత్రపటానికి మంత్రి, జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, ఆర్‌డిఒ దాసిరాజులు సంయుక్తంగా పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా సభలో మంత్రి మాట్లాడుతూ పాలకొల్లు నియోజకవర్గంలో లూయిస్ బ్రెయిలీ 216వ జయంతి వేడుకలు ఘనంగా జరుపుకొనుట తనకు వ్యక్తిగతంగా చాలా ఆనందాన్ని కలిగించిందని అన్నారు. వికలాంగులకు గత ప్రభుత్వం మొండి చెయ్యి చూపించిందని, మన ప్రజా ప్రభుత్వంలో రూ.3 వేల నుంచి రూ.6 వేలు పెన్షన్లు పెంచి ప్రతి నెల 1న ప్రతి గడపకు వెళ్లి అందజేస్తున్నామని అన్నారు. ప్రపంచ దేశాలలో కోట్లాదిమంది అంధులకు చూపును ప్రసాదించిన మహనీయుడు బ్రెయిలీ అన్నారు. బ్రెయిలీ భౌతికంగా మన మధ్య లేకపోయినా అందరి హృదయాలలో చెరగని ముద్ర వేసుకున్నారని మంత్రి రామానాయుడు అన్నారు. జెసి మాట్లాడుతూ మానవజాతి పుట్టినప్పటి నుంచి పదిమంది ముఖ్యులలో బ్రెయిలీ ఒకరని అన్నారు. వికలాంగుల పట్ల సానుభూతి చూపటం కాదని ప్రేమ, ఆప్యాయతలు పంచాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ ఛైర్మన్ జి.కోటేశ్వరరావు, ఆర్‌డిఒ దాసిరాజు, సర్వ శిక్ష అభియాన్ ఎపిఒ పి.శ్యామ్ సుందర్ పాల్గొన్నారు.

ఆచంట : అంధుల జీవితాల్లో వెలుగు నింపిన మహనీయులు లూయిస్ బ్రెయిలీ అని ప్రధానోపాధ్యాయులు బాలయ్య అన్నారు. ఆచంట మండల పరిషత్ ప్రాథమిక(బాలురు) పాఠశాలలో శనివారం లూయిస్ బ్రెయిలీ పుట్టినరోజుని పురస్కరించుకుని విద్యార్థులకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బాలయ్య మాట్లాడుతూ 'సర్వేంద్రియాణం నయనం ప్రధానం' అని తెలియజేస్తూ కళ్లను కోల్పోయిన 'లూయిస్ బ్రెయిలీ' అంధుల జీవితాల్లో వెలుగు నింపిన మహనీయుడు అని కొనియాడారు. ఆయన అంధుల కోసం ఆరు చుక్కల బ్రెయిలీ లిపిని కనుగొన్నారన్నారు. ఈ బ్రెయిలీ లిపితో ఎంతో మంది అంధులు చదువుకుని టీచర్లు, సంగీత కళాకారులు, కలెక్టర్లగాను ఉన్నతమైన వృత్తులలోను, ఉద్యోగాలు చేస్తున్నారన్నారు. చదువుకు వైకల్యం అడ్డు కాదని తన వైకల్యాన్ని అధిగమించి అంధులకు ఆశాజ్యోతి అయ్యారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఐఇఆర్‌పిలు గణేష్, ఐశ్వర్య, తరగతి ఉపాధ్యాయులు సునీత, విజయలక్ష్మి, దుర్గ, విద్యార్థులకు అవగాహన కల్పించారు.

యుటిఎఫ్ స్వర్ణోత్సవ రాష్ట్ర మహాసభను జయప్రదం చేయాలి

ఉభయగోదావరి జిల్లాల టీచర్ ఎంఎల్‌సి గోపీమూర్తి

భీమవరం : నేటి నుంచి మూడు రోజుల పాటు కాకినాడలో ప్రతిష్టాత్మకంగా జరుగుతున్న యుటిఎఫ్ రాష్ట్ర 17వ, స్వర్ణోత్సవ మహాసభలను జయప్రదం చేయాలని పిడిఎఫ్ ఎంఎల్‌సి, యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి బొర్రా గోపీమూర్తి పిలుపునిచ్చారు. మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ అనంతపురంలో ప్రారంభమైన జాత కర్నూలు, గుంటూరు, మచిలీపట్నం మీదుగా శనివారం మధ్యాహ్నం భీమవరం చేరుకుంది. భీమవరంలో జరిగిన మూడవ రాష్ట్ర మహాసభల పతాకజాతాను ఎంఎల్‌సి గోపీమూర్తి ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్ర విద్యారంగ దశ దిశ నిర్దేశం చేస్తాయని ఆకాంక్షించారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పిఎస్.విజయరామరాజు, ఎకెవి.రామభద్రం మాట్లాడుతూ జిల్లా నుంచి ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో కాకినాడకు కదిలి వెళుతున్నారన్నారు. రాష్ట్ర కార్యదర్శి కెఎ.ఉమామహేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

6న ఉండిలో మంత్రి నారా లోకేష్ పర్యటన

ప్రజాశక్తి - భీమవరం

ఈనెల 6న ఉండి నియోజకవర్గంలో పలు కార్యక్రమాల్లో పాల్గొనేందుకు రానున్న రాష్ట్ర ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్స్, మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేష్ పర్యటన ఏర్పాట్లను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈనెల 6న తేదీన గన్నవరం విమానాశ్రయం నుంచి ఉదయం 8:40కు రోడ్డు మార్గాన బయలుదేరి ఉదయం 10:30కు ఉండి జెడ్పి హైస్కూల్ కు చేరుకుంటారు. అధునాతనంగా 108 సంవత్సరాల హైస్కూల్ భవనాన్ని, క్రీడా సౌకర్యాలను ప్రారంభిస్తారు. అనంతరం ఉదయం 11 గం.లకు ఉండి హైస్కూల్ నుంచి బయలుదేరి పెద్ద అమిరం భీమవరం ప్రవేశ ద్వారం వద్ద ఏర్పాటుచేసిన రతన్ టాటా కాంస్య విగ్రహాన్ని ప్రారంభించి, అనంతరం రతన్ టాటా మార్గ్ గా నామకరణ చేసిన భీమవరం ఉండి లింక్ రోడ్డు విస్తరణ పనులకు శంకుస్థాపన చేస్తారు. అనంతరం ఉదయం 11.30కు ఎస్ఆర్కెఆర్ ఇంజనీరింగ్ కళాశాల ఓపెన్ ఆడిటోరియంలో ఏర్పాటుచేసిన సమావేశంలో పాల్గొంటారు. అక్కడ ఏర్పాటు చేసిన సంక్రాంతి సంబరాలు కార్యక్రమంలో పాల్గొని, అనంతరం ఎవనిటిజ ఐడియా ల్యాబ్ ను సందర్శిస్తారు. మధ్యాహ్నం 12.30కు ఎస్ఆర్కెఆర్ ఇంజనీరింగ్ కళాశాల నుంచి బయలుదేరి శాసనసభ ఉపసభాపతి రఘురామకృష్ణంరాజు గృహానికి చేరుకుని విందును స్వీకరిస్తారు. మధ్యాహ్నం 1.30కు ఉప సభాపతి గృహం నుంచి బయలుదేరి కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాస వర్మ గృహానికి మధ్యాహ్నం 1.50కు చేరుకుంటారు. తిరిగి మధ్యాహ్నం 2 గంటలకు భీమవరం నుంచి రోడ్డు మార్గాన బయలుదేరి విజయవాడ వెళ్తారని జిల్లా కలెక్టర్ తెలిపారు. సంబంధిత అధికారులు కలిసికట్టుగా పనిచేసి కార్యక్రమం విజయవంతానికి కృషి చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - మొగల్తూరు

మండల కేంద్రం మొగల్తూరులోని సంకరావ్ కాంప్లెక్స్ లో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు శ్రీసీతారామ మెడికల్ స్టోర్స్ అధినేత సంకా సోమరాజు తెలిపారు. తమ కుమారుడు, గుండె శస్త్రచికిత్స వైద్య నిపుణులు డాక్టర్ సంకా వివిఎస్ పాపారావు ఈ శిబిరానికి వచ్చే ప్రజలను ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు పరీక్షించి, వైద్య సేవలు అందించనున్నారని తెలిపారు. ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలిందిగా ఆయన కోరారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

మండలంలోని బంగారుగూడెం గ్రామ ఎంపిటిసి సుబ్బలక్ష్మి మామగారైన ఇటీవల మరణం చెందడంతో జగ్గంపేట గ్రామంలోని సుబ్బలక్ష్మి కుటుంబ సభ్యులను శనివారం వైసిపి రాష్ట్ర రైతు వర్కింగ్ ప్రెసిడెంట్ వడ్డీ రఘురామ్ నాయుడు పరామర్శించారు. అనంతరం ఇటీవల మృతిచెందిన కడియద్ద గ్రామానికి చెందిన జలపతి అచ్యుతం కుటుంబ సభ్యులను పరామర్శించి, ఆ కుటుంబ సభ్యులకు రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో జెడ్పిటిసి ముత్యాల అంజనేయులు, ఎంపిపి శేషులత, బంగారుగూడెం సర్పంచ్ చంద్ర శ్రీను, వెంకటరాయపురం ప్రెసిడెంట్ ఎల్లో గాంధీ, ఎంపిటిసి మద్దిపూడి సుబ్బారావు, కొండబోయిన కృపావరం, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

మాధవనాయుడుకు పరామర్శ

నరసాపురం : మాజీ ఎంఎల్ఎ బండారు మాధవనాయుడు తండ్రి బండారు ప్రతాప్ నాయుడు ఇటీవల మృతిచెందిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా శనివారం మాధవనాయుడును సరిపల్లిలోని ఆయన నివాసంలో భీమవరం మాజీ ఎంఎల్ఎ గ్రంథి శ్రీనివాస్ పరామర్శించారు. ముందుగా ప్రతాప్నాయుడు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో పులపర్తి దత్తు, కొండేటి శ్రీను పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థి గొప్ప ఆవిష్కర్త కావాలి

తాడేపల్లిగూడెం : ప్రతి విద్యార్థి గొప్ప ఆవిష్కర్తగా తయారుకావాలని ఎపి నిట్ డీన్ ప్లానింగ్ అండ్ డెవలప్మెంట్ డాక్టర్ సందీప్ సూచించారు. తూర్పుగోదావరి జిల్లా పెద్దాపురంలోని జవహర్ నవోదయ విద్యాలయం, పెంటపాడులోని ప్రభుత్వ పోస్ట్ బేసిక్ పాఠశాలల నుంచి మొత్తం 180 మంది విద్యార్థులు శనివారం నిట్ ప్రాంగణాన్ని సందర్శించారు. ప్రాంగణంలోని ఇండోర్ స్టేడియం, ప్రయోగశాలలు, గ్రంథాలయం, వర్క్షాపులను పరిశీలించారు. యంత్రాల పనితీరు, వాటి ప్రయోజనాలను సిబ్బంది అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ సందీప్ మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యాలను నిర్దేశించుకుని, వాటి సాధనకు నిరంతరం పాటుపడాలని తెలిపారు. ఉపాధ్యాయులు కె.విజయ్, ప్రేమలత, మనీషా, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

సిసి రోడ్ల నిర్మాణ పనుల పరిశీలన

తాడేపల్లిగూడెం : ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సిసి రోడ్ల నిర్మాణం నిబంధనల ప్రకారం పెట్టుకుని పంచాయతీ తీసుకురావాలని జెడ్పి సిఇఒ కె.సుబ్బారావు సూచించారు. మండలంలోని మాధవరంలో పల్లె పండుగలో భాగంగా నిర్మిస్తున్న సిసి రోడ్ల నిర్మాణాన్ని శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామంలో సిసి రోడ్ల నిర్మాణం గతంలో నిర్మించిన భూగర్భ డ్రైనేజీ వివరాలు తెలుసుకున్నారు. ఎంపిడిఒ ఎం.విశ్వనాథ్, పంచాయతీరాజ్ డిఇ యు.శ్రీనివాస్, ఎఇ శ్రీనివాసకుమార్, సర్పంచ్ ముప్పిడి సూర్యకుమారి పాల్గొన్నారు.

దాళ్వా పంట నమోదుపై అవగాహన

ఉండి: దాళ్వాలో పంటనమోదు పై అవగాహన సదస్సును మండల వ్యవసాయ అధికారి కార్యాలయం ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా వ్యవసాయాధికారి జెడ్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ తప్పనిసరిగా ఇ-క్రాప్ నమోదు చేసుకోవాలని రైతులకు సూచించారు. రైతులతో మాట్లాడి పంట సాగు యాజమాన్య పద్ధతుల గురించి వివరాలు తెలుసుకున్నారు. ఆకివీడు సహాయ వ్యవసాయ సంచాలకులు కెఎస్ఎస్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గుండెపోటుతో పంచాయతీ గుమస్తా మృతి

ప్రజాశక్తి - ఉండి

మండలంలోని పాములపర్రు గ్రామపంచాయతీలో కాంట్రాక్టు విభాగంలో పనిచేస్తున్న పంచాయతీ గుమస్తా కోళ్ళొట్ల నారాయణ ప్రసాద్(54) శనివారం గుండెపోటుతో మరణించారు. ఉదయం కార్యాలయానికి వెళ్లే సమయంలో ప్రసాద్ కళ్లు తిరిగి పడిపోవడంతో స్థానికులు హుటాహుటిన భీమవరంలోని ఆస్పత్రికి తరలించగా అప్పటికే గుండెపోటుతో మరణించినట్లు వైద్యులు ధృవీకరించారని స్థానికులు తెలిపారు. గత కొన్ని సంవత్సరాలుగా పాములపర్రు పంచాయతీలో కార్యదర్శి కార్యాలయంలో విధులను బాధ్యతగా నిర్వర్తించారని, అటువంటి వ్యక్తి ఆకస్మిక మరణం బాధాకరమని గ్రామ మాజీ సర్పంచి పెదిరీపు, మాజీ ఎంపిటిసి ముసలయ్య అన్నారు.

పారిశుధ్య పనుల పరిశీలన

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం మున్సిపల్ పరిధిలో వివిధ వార్డులలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులు పనిముట్లు, ఆరోగ్య పరిరక్షణకు అవసరమైన వస్తువులను సకాలంలో అందజేయాలని మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య అధికారులకు ఆదేశించారు. శనివారం ఆయన క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా కార్మికుల అవసరమైన పనిముట్లు పూర్తికలిగించేట్లు పారిశుధ్యం, ఫాగింగ్ మిషన్, మరికొన్ని పనిముట్ల నాణ్యతను ఆయన పరిశీలించారు. అనంతరం కొన్ని ప్రదేశాలలో జంగిల్ క్లియరెన్స్ చేయించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్స్పెక్టర్ వేంద్ర ప్రసాద్, పాత్రుడు, ఏఎస్ఐ నవ్య పాల్గొన్నారు.

రేషన్ షాపులకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - ఉండి

మండలంలోని నూతన రేషన్ షాపుల ఏర్పాటుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు భీమవరం రెవెన్యూ శాఖ మండలం డిప్యూటీ తహశీల్దార్ మొరంపూడి మహేశ్వరరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలోని షాప్ నెంబర్ 8 ఉండి(బిసి-బి), షాప్ నెంబర్ 25 పెదపుల్లేరు(ఎస్సి), షాప్ నెంబర్ 36 మహదేవపట్నం(ఎస్ సి - ఓపెన్), షాప్ నెంబర్ 37 యండగండి(ఓసి)లకు ఈనెల 12వ తేదీలోపు దరఖాస్తులు చేసుకోవాలని, అభ్యర్థులు ఇంటర్ పూర్తి లేదా ఇంటర్ చదువుతున్న ఫెయిల్ అయిన వారు దరఖాస్తు చేసుకోవచ్చని వారు తెలిపారు. 18 నుంచి 40 సంవత్సరాల మధ్య వయస్సు గలవారు అర్హులని వారు ఉండి మండల తహశీల్దార్ కార్యాలయం వద్ద, లేదా భీమవరం ఆర్డిఒ కార్యాలయంలో గాని దరఖాస్తు చేసుకోవచ్చునని మహేశ్వరరావు తెలిపారు.

కాళ్ల : మండలంలోని కొత్తగా రేషన్ షాపుల ఏర్పాటుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కాళ్ల తహశీల్దార్ జి.సుందర సింగ్ తెలిపారు. మండలంలోని షాపు-12 కళ్ల గ్రామ(బిసి-బి ఓపెన్), షాపు-19 కాళ్లకూరు గ్రామం - (ఎసి), షాపు-26 కలవపూడి గ్రామం (ఓసి - ఓపెన్, ఇడబ్ల్యూఎస్)లకు ఈనెల 12వ తేదీలోపు దరఖాస్తులు చేసుకోవచ్చునని చెప్పారు.

ప్రజాశక్తి
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈ క్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

కళాశాలల్లో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం ప్రారంభం

రాష్ట్రంలో 475 కాలేజీల్లో రూ.1.48 లక్షల విద్యార్థులకు పథకం అమలు

రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు

వీరవాసరం : విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న ఎంఎల్సి గోపీమూర్తి, ఎంఎల్ఎ అంజిబాబు

ప్రజాశక్తి - పాలకొల్లు

విద్యాశాఖ మంత్రిగా నారా లోకేష్ విద్యావ్యవస్థలో సమూల మార్పులకు శ్రీకారం చుట్టారని, ఈరోజు ఇంటర్మీడియట్ విద్యార్థులకు డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం రాష్ట్రంలోని అన్ని జూనియర్ కాలేజీల్లో ప్రారంభించుకోవడం శుభపరిణామమని జలవనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. స్థానిక కోకోనట్ మర్చంట్స్ ప్రభుత్వ జూనియర్(బాలికలు) కళాశాలలో మధ్యాహ్న భోజనం పథకాన్ని ఆయన, జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి సంయుక్తంగా ప్రారంభించారు. అనంతరం విద్యార్థినులకు భోజనాలను వడ్డించి మంత్రి, జెసి విద్యార్థినులతో కలసి సహపంక్తి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడుతూ విజయవాడలోని పాయకాపురం ప్రభుత్వ జూనియర్ కాలేజీలో విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఈ పథకాన్ని లాంఛనంగా ప్రారంభించారని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 475 ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో చదివే 1.48 లక్షల మంది ఈ పథకం వల్ల నేరుగా లబ్ధి పొందనున్నారని తెలిపారు. ఇందుకోసం ప్రభుత్వం ప్రస్తుత విద్యా సంవత్సరంలో మిగిలిన కాలానికి రూ.27.39 కోట్లు ఖర్చు చేయనున్నదని అన్నారు. రాష్ట్రంలో మధ్యాహ్న భోజన పథకాలకు సంవత్సరానికి రూ.100 కోట్లకుపైగా ఖర్చు చేస్తున్నామన్నారు. కాలేజీల్లోనూ మధ్యాహ్న భోజన పథకం వల్ల విద్యార్థుల సంఖ్య పెరిగి, నూటికి నూరుశాతం ప్రతిఒక్కరూ చదువుకుంటారని, మధ్యలో చదువుమానుట ఒక్క కేసు ఉండకూడదని ప్రభుత్వ లక్ష్యం అన్నారు. గత టిడిపి ప్రభుత్వంలో ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో మధ్యాహ్న భోజన పథకం అమల్లో ఉందని, గత ప్రభుత్వం దానిని రద్దుచేసిందని ఆ నిర్ణయం పేద విద్యార్థులపై ప్రభావం తీవ్రంగా చూపిందని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇంటర్ విద్యలో సంస్కరణలు ప్రారంభించి, విద్యార్థుల సంఖ్యను పెంచడం లక్ష్యంగా విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, బ్యాగులు పంపిణీ చేసిందన్నారు. మధ్యాహ్న భోజన పథకం లేకపోవడం వల్ల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని గుర్తించి దీంతో ఈ పథకాన్ని తిరిగి అమల్లోకి తీసుకు వచ్చి రాష్ట్ర వ్యాప్తంగా ఈరోజు ప్రారంభించుకున్నామని తెలిపారు. వచ్చే ఏడాది నుంచి ఇంటర్ విద్యార్థులకు సర్వేపల్లి రాధాకృష్ణ పేరున స్టూడెంట్ కిట్లు అందించాలని నిర్ణయం తీసుకున్నామని మంత్రి అన్నారు. జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్కుమార్ రెడ్డి మాట్లాడుతూ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలు చేయుట రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం శుభ పరిణామం అన్నారు. నిరుపేద కుటుంబాలలో విద్యార్థులకు చదువుకోడానికి సువర్ణ అవకాశం అన్నారు.

ఆచంట : విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎంఎల్ఎ పితాని

చదువు మధ్యలో ఆపివేయటం ఒక్క కేసు నమోదు కాదని, నూటికి నూరు శాతం హాజరు నమోదు అవుతుందన్నారు. మధ్యాహ్న భోజనం నాణ్యతగా, పౌష్టికాహారం అందించే లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. విద్యార్థుల నుంచి భోజనంపై ఫీడ్ బ్యాక్ తీసుకోవాలని, జిల్లాలో మధ్యాహ్న భోజన పథకాన్ని ఆకస్మిక తనిఖీలు చేస్తానని అన్నారు. విద్యార్థులకు ఇంటర్ చదువు ఒక సువర్ణ అవకాశానికి ఒక మెట్టు అని, ఈ మెట్టు విజయవంతం అయితే ఉన్నత చదువులకు గ్రీన్ సిగ్నల్ అవుతుందన్నారు. మా హయాంలో చదువుకోటానికి ఇన్ని అవకాశాలు లేవని, రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో అవకాశాలు కల్పిస్తుందని, ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డిఒ దాసిరాజు, మాజీ ఎంఎల్సి అంగర రామ్మోహన్, జిల్లా విద్యాశాఖ అధికారి ఇ.నారాయణ, తహశీల్దార్ వై.దుర్గా కిషోర్, పురపాలక సంఘం కమిషనర్ బి.విజయ సారధి, కళాశాల ప్రిన్సిపల్ బి.అప్పారావు, నాయకులు గండేటి వెంకటేశ్వరరావు, బోణం చినబాబు, కోడి విజయభాస్కర్, పాలవలస తులసీరావు, పీతల శ్రీనివాసు, చినమిల్లి గణపతి పాల్గొన్నారు.

వీరవాసరం : వీరవాసరం విఇసి జూనియర్ కళాశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తానని భీమవరం ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు) తెలిపారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్నం భోజనం పథకాన్ని శనివారం ఎంఎల్ఎ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మా తరానికి తెలియని కాలంలో అడిగిన వారికి లేదనకుండా అర్ధరాత్రినైనా భోజనం వండి పెట్టిన అన్నదాత డొక్కా సీతమ్మ అన్నారు. అటువంటి దాత పేరును ఉప ముఖ్యమంత్రి సూచనతో సిఎం చంద్రబాబునాయుడు ఈ పథకానికి ఆమె పేరుపెట్టడం సార్ధకత అవుతుందన్నారు. కార్పొరేట్ కళాశాల అధ్యాపకుల కంటే ప్రభుత్వ కళాశాలలో అధ్యాపకులే మెరుగైన విద్యనందించగలరన్నారు. విద్యార్థులు కార్పొరేట్ కళాశాల మాయలో పడి మోసపోవద్దన్నారు. అంతకు ముందు కళాశాల పూర్వ విద్యార్థి, మాజీ ఎంపిపి వీరవల్లి చంద్రశేఖర్ కళాశాల అవిర్భావం, కళాశాల అభివృద్ధిలో ప్రయివేటు వ్యక్తుల నిర్లక్ష్యం, ప్రస్తుతం నెలకొన్న సమస్యలను ఎంఎల్ఎకి వివరించడంతో సమస్యల పరిష్కారానికి ఎంఎల్ఎ సానుకూలంగా స్పందించారు. ఎంఎల్సి బి.గోపీమూర్తి మాట్లాడుతూ మధ్యాహ్న భోజనం కళాశాలలో ప్రారంభించడం వల్ల దూర ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థుల ఆకలి బాధలు తప్పుతాయన్నారు. కోటూరి కమిషన్ సిఫార్సులు అమలు చేసినపుడే అధ్యాపకుల నాణ్యమైన విద్యనందించగలుగుతారన్నారు. అరవై నుంచి డబ్బై శాతం తక్కువ జీతంతో అధ్యాపకులు పనిచేస్తున్నారన్నారు. ఎయిడెడ్, ప్లస్-2 కళాశాలలకు కూడా ఈ పథకం వర్తింపచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి వీరవల్లి దుర్గాభవాని, జెడ్పిటిసి గుండా జయప్రకాష్నాయుడు, ప్రిన్సిపల్ సిహెచ్.రామచంద్రరావు, అధ్యాపకులు పి.ప్రభువరం, మెంటే పార్థసారథి, ఎంపిడిఒ కిరణ్కుమార్ పాల్గొన్నారు.

ఆచంట : ఆచంటలో గత ఐదేళ్లుగా బస్సు షెల్టర్, సులభ కాంప్లెక్స్ లేక మహిళలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, తక్షణమే మరుగుదొడ్లు నిర్మించి బస్ షెల్టర్ను ఏర్పాటు చేయాలని ఆచంట ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ అధికారులను ఆదేశించారు. మండలంలోని ఎంఇఆర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని ఆయన ప్రారంభించి, విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ హెడ్ క్వార్టర్ ఆచంట అయినప్పటికీ గడిచిన వైసిపి పాలనలో ఇక్కడ సరైన సదుపాయలు కల్పించడంలో వైఫల్యం చెందారని, దీనివల్ల ప్రయాణచోదకులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. వీటిని అధిగమించి ప్రయాణికులు ఇబ్బంది పడకుండా వారికి కనీస సదుపాయాలు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఎన్.శ్రీదేవి, ఎంఇఒ ఎ.ఉషారాణి, ఎంపిపి దిగమర్తి సూర్యకుమారి, జెడ్పిటిసి ఉప్పలపాటి సురేష్ బాబు, పార్టీ మండల అధ్యక్షులు కేతా వీరయ్య పాల్గొన్నారు.

గణపవరం : కార్పొరేట్ కాళాశాలలకు ధీటుగా ప్రభుత్వ కళాశాలలు తీర్చిదిద్దేందుకు కూటమి ప్రభుత్వం నిర్మాణాత్మకమైన చర్యలకు శ్రీకారం చేపట్టినట్లు ఉంగుటూరు ఎంఎల్ఎ పత్సమట్ల ధర్మరాజు అన్నారు. శనివారం గణపవరం జూనియర్ కాలేజీలో రాష్ట్ర ప్రభుత్వం అమలులోకి తీసుకొచ్చిన డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో, కళాశాలలో భోజన సదుపాయంతో ఇతర మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా పనిచేస్తుందని చెప్పారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలన్ని విద్యార్థులు ఉపయోగించుకొని భవిష్యత్లో అభివృద్ధి చెందాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపల్ సిహెచ్.శ్రీనివాస్ గౌడ్, రామచంద్రరాజు, కాలేజీ సిబ్బంది, టిడిపి, జనసేన నాయకులు పాల్గొన్నారు.

ఆకివీడు : వచ్చిన వారందరికీ లేదనకుండా కడుపు నింపి పంపించిన అలనాటి డొక్కా సీతమ్మ మన గోదావరి తీరావాసేనని ఉపసభాపతి కనుమూరు రఘురామ కృష్ణంరాజు గుర్తు చేశారు. మండలంలోని దుంపగడపలో ఆంధ్ర కేసరి ప్రకాశం శతజయంతి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించింది. ఈ కార్యక్రమాన్ని శనివారం మధ్యాహ్నం రాష్ట్ర శాసనసభ ఉపసభాపతి, స్థానిక ఎంఎల్ఎ కనుమూరు రఘురామకృష్ణంరాజు విద్యార్థులకు వడ్డించి ప్రారంభించారు. ప్రారంభంలో కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు ఆర్ఆర్ఆర్ను సత్కరించారు. ఈ కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రణాళిక అభివృద్ధి విభాగం కార్యదర్శి డాక్టర్ పిబి.ప్రతాప్ కుమార్, గ్రామ సర్పంచి విశ్వేశ్వరరావు, టిడిపి మండల అధ్యక్షులు మోటిపల్లి ప్రసాద్ పాల్గొన్నారు.

ఉండి: రాష్ట్ర ప్రభుత్వం ఇంటర్ విద్యార్థులకు డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించడంతో ఉండి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివే ఇంటర్ విద్యార్థులకు, యండగండి జూనియర్ కళాశాలలో చదివే విద్యార్థులకు శనివారం నుంచి మధ్యాహ్నం భోజన పథకాన్ని అధికారులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఇఒ జ్యోతి, ఎంఇఒ-2 వినాయకుడు మాట్లాడుతూ ఇంటర్ విద్యార్థులు అందరూ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

తణుకు : పేద, మధ్య తరగతికి చెందిన విద్యార్థులను ఉన్నత శిఖరాలకు చేర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వ ఎంతో కృషి చేస్తుందని తణుకు నియోజకవర్గ మాజీ ఎంఎల్ఎ ముళ్లపూడి వెంకటకృష్ణరావు అన్నారు. శనివారం తణుకు ఎస్ఎన్విటి జూనియర్ ప్రభుత్వ కళాశాల, అత్తిలి ఎస్విఎస్ఎస్ జూనియర్ ప్రభుత్వ కళాశాల్లో ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ ఆదేశాల మేరకు కూటమి నాయకులు డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించారు. కళాశాల యాజమాన్యాలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులు వినియోగించుకోవాలి

తణుకు రూరల్ : భూమి తగాదాలు, అన్యాక్రాంతమైన భూముల సమస్యల పరిష్కారం కోసం రెవెన్యూ సదస్సులు సద్వినియోగం చేసుకోవాలని తణుకు మండల తహశీల్దార్ డివివిఎస్ అశోక్ వర్మ పేర్కొన్నారు. తణుకు మండలం కోనాల గ్రామంలో శనివారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమం ద్వారా 12 అర్జీలు స్వీకరించినట్లు, వీటిని పరిశీలించి పరిష్కరించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి మల్లిపూడి చిన్నయ్య, పంచాయతీ కార్యదర్శి కొల్లూరి కిరణ్ కుమార్, డిప్యూటీ తహశీల్దార్ పి.గౌతమి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఉండి: రీ సర్వేలో అవకతవకలు జరిగాయని అధికారుల ముందు రైతులు వాపోయారు. శనివారం ఉండి మండలం చిన్నపుల్లేరు గ్రామంలో నిర్వహించిన రీ సర్వేలో పాల్గొన్న మండల ప్రత్యేక అధికారి ఆర్.వెంకటరమణ, మండల తహశీల్దార్ కె.నాగార్జున ఎదుట రైతులు గత ప్రభుత్వ హయాంలో జరిగిన రీ సర్వేలో అవకతవకలు జరగడంతో రీ సర్వే నిర్వహించిన సర్వేయర్ను నిలదీశారు. ఈ సందర్భంగా బొర్రా వెంకన్న అనే రైతుకు సుమారు 14 సెంట్ల భూమి, నూకల మోహన్ రావు అనే రైతుకు సుమారు 25 సెంట్లు భూమి, కాళ్ల గృహ నిర్మాణ శాఖ అసిస్టెంట్ ఇంజనీర్గా పనిచేస్తున్న సీతారామాంజనేయరాజుకు 10 సెంట్లు భూమి తేడా వచ్చిందని సర్వేయర్ను నిలదీయగా అధికారులు వారికి సర్దిచెబుతూ తమ సమస్య పరిష్కారం అయ్యేందుకు తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి సావిత్రమ్మ, ఉప సర్పంచి సువర్ణ రాజు, సాగునీటి సంఘం డైరెక్టర్ రామభద్రరాజు, ఆర్ఐ కార్తీక్, విఆర్ఒ దాసు పాల్గొన్నారు.

క్రికెట్ టీంకు శ్రీసూర్య ఎంపిక

ప్రజాశక్తి - నరసాపురం



ఆదికవి నన్నయ యూనివర్శిటీ క్రికెట్ టీంకు ఇటీవల జరిగిన సెలక్షన్స్లో శ్రీసూర్య డిగ్రీ కళాశాల విద్యార్థి స్థానం సంపాదించాడు. బికాం కంప్యూటర్ అప్లికేషన్స్ తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థి భోగరాజు సాయి సుశాంత్, ఆదికవి నన్నయ యూనివర్శిటీ క్రికెట్ టీంలో ఫాస్ట్ బౌలర్, మిడిల్ ఆర్డర్ బ్యాట్స్ మెన్గా ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా సాయి సుశాంత్ను కళాశాల సెక్రటరీ, కరెస్పాండెంట్ ఘంటసాల బ్రహ్మాజీ, అకడమిక్ అడ్వైజర్ బి.రామచంద్ర రెడ్డి తెలియజేశారు.

ఫ్రీ లీగల్ ఎయిడ్పై అవగాహన

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

లోక్ అదాలత్లో రాజీ అయిన కేసులలో కోర్టు ఫీజు రాయితీ వస్తుందని తాడేపల్లిగూడెం మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఛైర్మన్, 11వ అదనపు జిల్లా జడ్జి షేక్ సికిందర్ భాష తెలిపారు. శనివారం జరిగిన నూతన పారాలీగల్ వాలంటీర్ల శిక్షణా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫ్రీ లీగల్ ఎయిడ్ ఎలా పొందాలి అనే విషయాలు తెలియపరిచారు. ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జ్ కెఎస్.కిరణ్ శ్రీ మాట్లాడుతూ ఉచిత న్యాయ సహాయం అనేది ప్రాథమిక హక్కు అని, కక్షిదారులు ఎవరెవరికి ఈ సహాయం అనేది వర్తిస్తుందని వివరించారు. బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ దూలం విజయకుమార్ మాట్లాడుతూ మెయింటినెన్స్ కేసు, గృహహింస, చెక్ బౌన్స్ కేసుల గురించి, వారి బాధ్యతలు, సివిల్ చట్టాల గురించి సీనియర్ అడ్వకేట్ ఉంగరాల శివ కుమార్ వివరించారు. జూనియర్ సివిల్ జెడ్జి డి.అరుంధతి, 2వ అదనపు జూనియర్ సివిల్ జెడ్జి ఇ.అన్నామణి పాల్గొన్నారు.

నరసాపురం: మండల న్యాయ సేవాధికార కమిటీ అధ్యక్షురాలు, 10వ అదనపు జిల్లా న్యాయమూర్తి పి.విజయ దుర్గ స్థానిక కోర్ట్ ప్రాంగణంలో పారా లీగల్ వాలంటీర్లకు శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా విజయదుర్గ మాట్లాడుతూ గ్రామాలలో ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పించడానికి, పారా లీగల్ వాలంటీర్ల పాత్ర ఎక్కువగా ఉంటుందన్నారు. శిక్షణ పొందిన న్యాయ సేవాకార్యకర్తలు అటు ప్రజలకు, ఇటు మండల న్యాయ సేవాధికార సంస్థకు అనుసంధాన కార్యకర్తలుగా ఉండాలన్నారు. అనంతరం గుర్తింపు కార్డులను ఇచ్చారు.

భీమవరం టౌన్ : రాష్ట్ర, జిల్లా న్యాయ సేవా సంస్థల ఆదేశాల మేరకు భీమవరం మండల న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో మాధక ద్రవ్యాల వినియోగం, మానవ అక్రమ రవాణా, మంచి-చెడు స్పర్శలు, ర్యాగింగ్, బాల్య వివాహాలు, ఉచిత న్యాయ సహాయం అనే అంశాలపై భీమవరం డిఎన్ఆర్ న్యాయ కళాశాల విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీలు, లఘు చిత్రాలు, ఇన్స్టాగ్రాం రీల్స్ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ప్రైజుల పంపిణీ, పాల్గొన్న విద్యార్థులు అందరికి ప్రసంశా పత్రాలు అందజేసే కార్యక్రమం శనివారం న్యాయ కళాశాలలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా 3వ అదనపు జిల్లా జడ్జి, మండల న్యాయ సేవా సంస్థ ఛైర్మన్ ఎంఎ.సోమశేఖర్ పాల్గొని ఇటువంటి అవగాహనా పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) ఎం.సుధారాణి, ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) సురేష్ బాబు, 2వ అదనపు జుడీషియల్ మొదటి తరగతి మేజిస్ట్రేట్ డి.ధనరాజు పాల్గొన్నారు.

రహదారిని నిర్మించాలని నిరసన

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని ముత్యాలపల్లి గ్రామంలోని 216 జాతీయ రహదారి నుంచి అయ్యప్ప స్వామి గుడి వైపు వెళ్లు రహదారికి అనుసంధానంగా రహదారి నిర్మాణం చేయాలని కోరుతూ శనివారం గ్రామస్తులు నిరసన ప్రదర్శన చేశారు. గ్రామంలోని కౌరవారి మెరక తదితర ప్రాంతాల్లోని ప్రజలు ఈ మార్గంలోనే 216 జాతీయ రహదారిపైకి చేరుకుంటారు. దీనికి అనుసంధాన రహదారి నిర్మాణం చేయకపోవడంతో ఆ ప్రాంతంలో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జాతీయ రహదారుల అభివృద్ధి సంస్థ అధికారులు అనుసంధాన రహదారి నిర్మాణం చేయాలని కోరుతూ ఆరోగ్య వర్షిని ట్రస్ట్ ఛైర్మన్ నాగిడి రాంబాబు ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన చేశారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం

ప్రజాశక్తి - మొగల్తూరు

ప్రతిఒక్కరూ క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటారని ఐసిడిఎస్ సూపర్వైజర్ శ్రీదేవి అన్నారు. మండలంలోని కాళీపట్నం తూర్పులో హెచ్ఆర్ పేట అంగన్వాడీ కేంద్రంలో శనివారం విలేజ్ హెల్త్ న్యూట్రీషన్ డే, ఎర్లీ చైల్డ్ ఎడ్యుకేషన్ డేని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన పౌష్టికాహారాన్ని ఆమె వివరించారు. మహిళలకు రంగవల్లి పోటీలు నిర్వహించారు. ప్రతి కనబరిచిన వారికి బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ ఎస్.సారమ్మ, ఎఎన్ఎం నీరజ, ఎంఎల్హెచ్ఒ గణనాథ పాల్గొన్నారు.

తణుకు : గర్భిణులు, బాలింతలు తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలని సిడిపిఒ ప్రమోదిని కుమారి సూచించారు. శనివారం తణుకు పరిధిలోని జంగంచెరువు అంగన్వాడీ సెంటర్లో(ఎర్లి చైల్డ్హుడ్ కేర్, ఎడ్యుకేషన్) ఇసిసిఇ డే కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ప్రభుత్వం అందించే పిపి1, పిపి2 బుక్స్ కోసం తల్లులకు వివరంగా తెలియజేశారు. అనంతరం పిల్లలతో సృజనాత్మక కార్యక్రమాలు నిర్వహించారు. ఎసిడిపిఒ ఆశ, సూపర్వైజర్ ఎం.అరుణకుమారి పాల్గొన్నారు.

యలమంచిలి : మండలంలోని దొడ్డిపట్ల గ్రామంలో పాలకొల్లు ప్రాజెక్టు కోడ్ నెంబర్ 191, 192 అంగన్వాడీ కేంద్రాలలో ఇసిసిఇ డేను విద్యార్థులు వారు తల్లిదండ్రుల సమక్షంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక సంత మార్కెట్లో కూరగాయలను అమ్మడం, కొనడం వంటి వాటిపై అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో పిల్లలతో కూరగాయలు విక్రయించడం, కొనుగోలు చేయించడంపై అవగాహన కల్పించిన అనంతరం వారికి ఆటపాటలు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్త వి.పద్మశ్రీతో పాటు వివిధ సెంటర్ల నుంచి అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉండి: మూడు సంవత్సరాలు నిండిన చిన్నారులను అంగన్వాడీలలో చేర్పించడం తప్పనిసరి అని ఐసిడిఎస్ సూపర్వైజర్ సూర్యకుమారి అన్నారు. ఉండి మండలం యండగండి, ఉండి గ్రామాలలో శనివారం నిర్వహించిన కార్యక్రమాలను ఉద్దేశించి వారు మాట్లాడుతూ మూడు సంవత్సరాల నుంచి చిన్నారులు అంగన్వాడీలో విద్యనభ్యసించడం వల్ల తోటి వారితో ఏ విధంగా మెలగాలి అనే విషయాన్ని తెలుసుకుంటారని, అంగన్వాడీలలో ప్రతి పాఠాన్ని బొమ్మల రూపంలో నేర్పిస్తారని వివరించారు. అంగన్వాడీ కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

పాలకొల్లు రూరల్: మండలంలోని శివదేవుని చిక్కాల అంగన్వాడీ కేంద్రంలో, పెంకుళ్ల పాడు అంగన్వాడీ సెంటర్లో శనివారం ఎర్లీ చైల్డ్ హుడ్ కేర్ అండ్ ఎడ్యుకేషన్ డే నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రాజెక్ట్ డైరెక్టర్ బి.సుజాత రాణి, సిడిపిఒ విజయలక్ష్మి విచ్చేశారు. ఈ సందర్భంగా సుజాత రాణి పిల్లలతో ముచ్చటించి వారి యోగక్షేమాలను కనుక్కొని, వారు విద్యను అభ్యసించే విధానం గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ ఎన్.మంగ, పాలకొల్లు సెక్టార్ సూపర్వైజర్ మల్లేశ్వరి పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం : అంగన్వాడీ పిల్లలకు ఆరోగ్యకరమైన ఆహారం అందించడంతోపాటు వారి విద్యాభివృద్ధికి కావాల్సిన మెలకువలు నేర్పుగా అందించడం ప్రతీ కార్యకర్త బాధ్యత అని సిడిపిఒ టి.లక్ష్మి సరస్వతి పేర్కొన్నారు. శనివారం తాడేపల్లిగూడెం మండలం జగన్నాథపురం, ఆరుగొలనులో నిర్వహించిన ఎర్లిచైల్డ్ హుడ్ కేర్ ఎడ్యుకేషన్ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మాధవరం సెక్టార్ సూపర్వైజర్ కె.శ్రీదేవి, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మహారాజశ్రీ తాడేపల్లిగూడెం 2వ అడిషినల్ జూనియర్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో, తాడేపల్లిగూడెం

ఇ.పి.నెం.9/2024 ఇన్ ఓ.ఎస్.నెం.212/2022

బిట్వీన్:
రెడ్డి సత్యనారాయణ
...డి.హెచ్.ఆర్ /ప్లెయింటిఫ్
మద్దుకూరి నాగేశ్వరరావు
...జె.డి.ఆర్ /డిఫెండెంట్

శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం ఆస్థి వేలం ప్రకటన

పై నెంబరు డిక్రీ బాకీ గాను ప్రతివాది /జె.డి.ఆర్ తాలూకు ఈ దిగువ షెడ్యూలు దాఖలా ఆస్థి **ది. 20-01-2025 వ తేదీన ఉదయం గం॥10:30 ని॥ల లగాయతు పై కోర్టులో వేలం వేయబడును.** షరతులు తెలుసుకొని పాడుకొనవలెను.

షెడ్యూలు: పశ్చిమ గోదావరి జిల్లా, తాడేపల్లిగూడెం మండలం, జగన్నాదపురం గ్రామం తాలూకు వ్యవసాయ భూమి bearing R.S.No.115 to an extent of Ac.0-60 Cents of Agriculture land bounded by:
East: Talla Venkateswarao's Land.
South: Maddhukuri Ramarao's Land.
West: Land of Siddhina Sirisha.
North: Siddhina Venkataswararao's Land. & Etc., Land.

పై హద్దుల మధ్య య.0-60 సెంట్లు గల వ్యవసాయ భూమి సమస్త ఈజుమెంటు హక్కులతో సహా.
వాది /డి.హెచ్.ఆర్ వాల్యూ /కిమ్మత్తు : రూ.10,00,000/-
అమీనా వాల్యూ /కిమ్మత్తు : రూ.20,00,000/-

MUTYALA SUNIL KUMAR
Advocate for D.H.R.
Tadepalligude.

పబ్లిక్ నోటీసు

నా క్లయింట్ ఏలూరు జిల్లా, ముసునూరు మండలం, రమణక్కపేట గ్రామ కాపురస్తుడు చిట్లూరి సత్యనారాయణ గారి కుమారుడు భాస్కరరావు యిచ్చిన సంజాయిషీ ప్రకారము నా క్లయింట్ పూర్వం కృష్ణాజిల్లా, ప్రస్తుతం యన్.టి.ఆర్.జిల్లా, విస్సన్నపేట సబ్-రిజిస్ట్రారు వారి యిలాకా చాట్రాయి మండలం, సోమవరం గ్రామ పంచాయితీ పరిధిలోని రీ.సర్వే నెం.347/2లో య.0.95 సెంట్ల వ్యవసాయ భూమిని ది.14.09.2010వ తేదీన సోమవరం గ్రామ కాపురస్తులు శ్రీమతి కొండూరి గిరిజా కుమారి నుండి కొనుగోలు చేసి విస్సన్నపేట సబ్-రిజిస్ట్రారు వారి యిలాకా డాక్యుమెంట్ నెం.4096/2010 గా విక్రయ దస్తావేజు రిజిస్టరు కాబడి తదాది నా సంపూర్ణ స్వాధీన హక్కుభుక్తములలో అనుభవించుచున్నాడు. ఇట్టి క్రమములో నా క్లయింట్ ది.01.01.2025వ తేది ఉదయం గం॥9.00ల సమయములో పై తెలిపిన డాక్యుమెంట్ నెం.4096/2010 గల ఒరిజినల్ దస్తావేజును నూజివీడు పట్టణములోని మైలవరం రోడ్డులోని జిరాక్స్ షాపు వద్దకు వెళ్ళగా సదరు ఒరిజినల్ దస్తావేజు జిరాక్స్ షాపు వద్ద జారి పడిపోయినది. దానిపై నా క్లయింట్ చుట్టుప్రక్కల ప్రదేశాలు వెదికినప్పటికీ ఒరిజినల్ దస్తావేజు కనిపించలేదు. కావున పై తెలిపిన దస్తావేజు ఎవరికైనా దొరికిన యెడల నాకు గాని, నా క్లయింట్కు గానీ అందజేయగలరు.

నక్కనబోయిన మురళీకృష్ణ
నల్లిబోయిన వంశీ
నూజివీడు న్యాయవాదులు, నూజివీడు.
తేది.04.01.2025 సెల్: 8008298419.

పేరు మార్పు

యిబ్బా జెసురాణి, భర్త కర్నాటి వెంకట శ్రీను, స్త్రీ, డోర్నెం.14-8-8, దొరల వీధి, 25వ వార్డు, యాగర్లపల్లి, తాడేపల్లిగూడెం, పిన్నెం.534102, పశ్చిమ గోదావరి జిల్లా. అను నేను తెలియజేయునది నా అసలు పేరు యిబ్బా జెసురాణి కాని నా భర్త సర్టిఫికెట్స్ నందు రాణి కర్నాటి అని పడినది, కాని వాస్తవంగా నా అసలు పేరు యిబ్బా జెసురాణి అని ఇందుమూలముగా తెలియజేయటమైనది.

పాస్పోర్టు పోయినది

పశ్చిమగోదావరి జిల్లా, ఆచంట మండలం, ఆచంట గ్రామానికి చెంది అద్దాల శ్రీనివాస్, తండ్రి : గంగారావు అను నేను నా యొక్క పాస్పోర్ట్ పడిపోయింది. ఇంటి దగ్గర నుండి నెట్ సెంటర్ కు వెళ్తుండగా నా యొక్క పాస్పోర్ట్ నెంబర్ : U0385007 గల పాస్పోర్టు పడిపోయినది, ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది అడ్రస్ కు తెలియజేయగలరు.

అద్దాల శ్రీనివాసు, తండ్రి : గంగారావు
డోర్ నెం : 3-98, ఆచంట, ఆచంట మండలం
ప.గో.జిల్లా. సెల్ : 9550922169

పాస్పోర్టు పోయినది

పశ్చిమగోదావరి జిల్లా నర్సాపురం మండలం చిట్టవరం గ్రామానికి చెంది ఉచ్చుల సుధారాణి C/o.సురేష్ కుమార్ అను నేను నా యొక్క పాస్పోర్టు పడిపోయింది. ఇంటి నుండి జిరాక్స్ సెంటర్ కు వెళ్తుండగా నా యొక్క పాస్పోర్టు నెంబర్ : L5191047 గల పాస్పోర్టు ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది అడ్రస్కు తెలియజేయగలరు.

అడ్రస్ : **ఉచ్చుల సుధారాణి,** C/o.సురేష్ కుమార్
డోర్ నెం : 3-182, చిట్టవరం
నరసాపురం మండలం, ప.గో.జిల్లా.
సెల్ : 7702381288